వరద బాధితులకు అండగా..

కృష్ణా నదిలోని లంక గ్రామాల్లో తీరని నష్టం
పరిహారం పంపిణీకి యంత్రాంగం ఏర్పాట్లు

బాపట్ల, న్యూస్‌టుడే

వరదలు ముంచెత్తడంతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోంది. నెల ఆరంభంలో కృష్ణా నదికి వచ్చిన వరద నీరు లంక గ్రామాలను చుట్టుముట్టింది. నెల రోజుల్లోపే నష్ట పరిహారం ఆయా బాధితుల ఖాతాల్లోకి జమ చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వరదకు నష్టపోయిన బాధితుల జాబితాలను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లాలోని 24 లంక గ్రామాల్లో వరదకు దెబ్బతిన్న గృహాలు, జంతువుల షెడ్లు, ముంపు బారినపడ్డ ఇళ్ల వివరాలను సర్వే చేసి నమోదు చేశారు. పంట నష్టపోయిన రైతుల జాబితా ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. ఎన్‌ఐసీ పోర్టల్‌లో వివరాల నమోదులో ఆధార్ సమస్యలు కారణంగా తుది జాబితా ఖరారులో కొంత జాప్యం చోటుచేసుకుంటోంది.



వరదలకు నీటమునిగిన లంక గ్రామం (పాతచిత్రం)

పూర్తయిన సామాజిక తనిఖీ

వరదలకు 25 పశువులు, 34 గొర్రెలు, మేకలు, 351 కోళ్లు మృతి చెందాయి. ఒక్కో పశువుకు రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.12.50 లక్షలు, గొర్రె, మేకకు రూ.7500 చొప్పున రూ.2.55 లక్షలు, కోడికి రూ.వంద చొప్పున రూ.35,100 సాయం అందనున్నది. నలుగురు ఎస్టీ కుటుంబాలకు ఆధార్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు లేకపోవటానికి వారికి నేరుగా పరిహారం నగదు చెల్లించడానికి ప్రభుత్వ అనుమతిని కలెక్టర్ కోరారు. 499 మంది బాధితుల ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. సాంకేతిక సమస్యలను పరిష్కరించి వీరి ఈకేవైసీ పూర్తి చేసి సాయం అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వరద నష్ట పరిహారానికి అర్హులైన జాబితాల వివరాలను గ్రామ సచివాలయాల వద్ద ప్రచురించారు. సామాజిక తనిఖీ పూర్తి చేశారు.

సిద్ధమవుతున్న పంట పొలాల జాబితా

జిల్లాలో 49 వేల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 31 వేల మంది రైతులకు పరిహారం అందాల్సి ఉంది. వరి, అపరాలు, అరటి, పసుపు, కంద, నిమ్మ, జామ, కూరగాయల పంటలు దెబ్బతినగా వీటికి అందించే పరిహారాన్ని ప్రభుత్వం 47 నుంచి 194 శాతానికి పెంచింది. పంట నష్టపోయిన రైతుల వివరాలు ఎన్‌ఐసీ పోర్టల్‌లో ఆన్‌లైన్లో నమోదు సందర్భంగా పలు సమస్యలు వచ్చాయి. ఆధార్ కార్డు నంబరు బ్యాంకు ఖాతాకు లింకు కాకపోవడం, ఆధార్ కార్డులో సమస్యల కారణంగా తుది రైతుల జాబితా ఖరారులో జాప్యం జరిగింది. మంగళవారం రాత్రికి పూర్తి వివరాలు వస్తాయని వ్యవసాయ, ఉద్యాన అధికారులు తెలిపారు. జాబితా ఖరారు కాగానే పెరిగిన పరిహారం నగదు మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు.

బ్యాంకు ఖాతాల్లో జమ

వరదకు నష్టపోయిన అందరి వివరాలు పారదర్శకంగా సేకరించాం. ప్రభుత్వం బాధితులందరికీ సాయం చేసి న్యాయం చేస్తుంది. ఒక్క పంటలకు సంబంధించి తుది జాబితా ఖరారు కావాల్సి ఉంది. ఎన్‌ఐసీ వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ నమోదులో వచ్చిన సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం. అతి త్వరంలో పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

– ప్రఖార్‌జైన్, ఇన్‌ఛార్జి కలెక్టర్

వరద నీరు ప్రవేశించిన, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలు:	7970
ఒక్కో ఇంటికి అందించనున్న సాయం:	రూ.పది వేలు
అందనున్న మొత్తం సాయం:	రూ.7.97 కోట్లు
దెబ్బతిన్న పశువుల షెడ్లు:	438
ఒక్కో షెడ్డుకు ఇవ్వనున్న పరిహారం:	రూ.5 వేలు
అందనున్న మొత్తం సాయం:	రూ.21.90 లక్షలు
దెబ్బతిన్న పడవలు, వలలు:	628
మంజూరు చేయనున్న సాయం:	రూ.37.24 లక్షలు
వరదకు దెబ్బతిన్న చేపలు, రొయ్యల చెరువులు:	339 హెక్టార్లు
నష్టపోయిన రైతులు:	369
అందనున్న సాయం:	రూ.61.02 లక్షలు

రైళ్ల రద్దు

గుంటూరు: రైల్వే డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున పలు రైళ్లను రద్దు చేస్తున్నారు. ఈనెల 23వ తేదీ నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్(17201), సికింద్రాబాద్-గుంటూరు(12706), గుంటూరు-సికింద్రాబాద్(12705) రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు సికింద్రాబాద్-గుంటూరు(17202) రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విధేయతకు అందలం

- కూటమి శ్రేణులకు నామినేటెడ్ పదవులు
- క్రియాశీలక కార్యకర్తలకు తగిన గుర్తింపు

ఈనాడు–బాపట్ల

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, సభ్యులను మంగళవారం ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కార్యకర్తలకు పదవులు ప్రకటించి ఆనందాన్ని నింపింది. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నవారికి పట్టం కట్టారు. వైకాపా ఐదేళ్ల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలకు అండగా నిలబడిన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యకర్తలు, నేతలకు తెదేపా, బీజేపీ, జనసేనలో పెద్దపీట వేశారు. వివిధ సమీకరణలు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అన్ని సామాజికవర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ పదవులు భర్తీ చేశారు. దీంతో ఆయా వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

❖ మంగళగిరికి చెందిన తెదేపా సీనియర్ నేత నందం అబద్దయ్యను రాష్ట్ర పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. నందం అబద్దయ్య 1982 నుంచి తెదేపాలో కొనసాగుతున్నారు. జిల్లా స్థాయిలో పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. మంగళగిరి నియోజకవర్గానికి నారా లోకేష్ వచ్చిన తర్వాత నందం అబద్దయ్య పనితీరును గుర్తించి 2021లో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా నియమించారు. ❖ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా కుర్రా అప్పారావు నియమితులయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం ఉన్నవ స్వగ్రామం. గతంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. పార్టీలో 35 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. కుర్రా అప్పారావు తండ్రి ఉన్నవ గ్రామ సర్పంచిగా, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు.

❖ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పిల్లి మాణిక్యరావు నియమితులయ్యారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పిల్లి మాణిక్యరావు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. వినుకొండ నియోజకవర్గం పరిశీలకులుగా పనిచేశారు. ఎమ్మార్పీఎస్‌లో వివిధ హోదాల్లో పని చేసి 2017లో రాజీనామా చేసి తెదేపాలో చేరారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా పదవులు నిర్వర్తించారు. గత ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి సీటు ఆశించారు. ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో తెదేపా అభ్యర్థుల విజయం కోసం ప్రచారం నిర్వహించారు.

విద్యుత్తు అదాలత్‌తో సమస్యలకు పరిష్కారం

సంతమాగులూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని వినియోగదారులు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల్ని పరిష్కరించుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్, విశ్రాంత జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ సూచించారు. సంతమాగులూరులో మంగళవారం జరిగిన ప్రత్యేక విద్యుత్తు అదాలత్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన 22 దరఖాస్తుల్లో తక్షణ పరిష్కారానికి 13 తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్.శ్రీనివాసరావు, సునీత, ఎన్ఈ కేవీ.సత్యనారాయణ, స్థానిక విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



వినియోగదారుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న విక్టర్ ఇమ్మానియేల్

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: సత్ప్రవర్తన అలవర్చుకుని సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ జడ్జి పార్థసారథి అన్నారు. రేపల్లె మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రేపల్లె ఉప కారాగారంలో మంగళవారం విచారణ ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. క్షణికావేశంతో నేరాలు చేస్తే కుటుంబాలు మానసిక క్షోభకు గురవుతాయన్నారు. బయటకు వెళ్లిన తర్వాత పిల్లలకు మెరుగైన విద్య అందించాలని ఆయన కోరారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి లీలావతి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు శ్రీవాణి, గుమ్మడి కుమార్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ జడ్జి పార్థసారథి

గట్టిగా గాలి వీస్తే.. అంతే సంగతులు!



కొమ్మాలపాడు సినిమా థియేటర్ వద్ద ఉన్న నియంత్రిక నేలకూలేందుకు సిద్ధంగా ఉంది. నియంత్రిక బిగించిన విద్యుత్తు స్తంభాలు రెండు వైపులా ఒక వైపునకు విరిగిపోయి మరో వైపునకు వాలిపోయాయి. గాల్లో వేలాడుతున్న విద్యుత్తు ఊయలలా ప్రమాదకరంగా మారింది. తక్షణం అధికారులు స్పందించి నియంత్రికను సరైన క్రమంలో బిగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కొమ్మాలపాడు (సంతమాగులూరు)

స్తంభాలు విరిగి కూలడానికి సిద్ధంగా ఉన్న నియంత్రిక

గుండ్లకమ్మ పూర్వవైభవం తీసుకొద్దాం.. సహకరించండి

'ఈనాడు' కథనాన్ని ప్రస్తావిస్తూ వినతిపత్రం దాఖలు



గుండ్లకమ్మ పరిరక్షణకు ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న త్రిమూర్తులు, దివాకర్‌దత్తు తదితరులు

అద్దంకి, న్యూస్‌టుడే: జీవనది గుండ్లకమ్మ పరిరక్షణకు అధికార యంత్రాంగం ముందుకు రావాలని అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన 'నా బాధ ఎవరికీ పట్టదా' కథనానికి ప్రజాసంఘాల నేతలు స్పందించారు. అద్దంకి రెవెన్యూ కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ నిర్వహించిన ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదికలో చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డికి దీనిపై వినతిపత్రం అందించారు. గుండ్లకమ్మ పరిరక్షణ గురించి ఆర్డీవో మాట్లాడుతూ ప్రజారంజకమైన పనులు చేసేందుకు అధికార యంత్రాంగం ఎపుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. స్థానికులతో ఒక రోజు సమావేశం నిర్వహించి, ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే వివిధ సమస్యలపై 12 మంది తమ అర్జీలు సమర్పించారు. గ్రంథాలయానికి భవన సదుపాయం కల్పించాలని గ్రంథ పాలకుడు సుగుణారావు, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి గాడేపల్లి దివాకర్‌దత్తు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ జి.శ్రీచరణ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదవుదాం..

ఇంటింటి సర్వేలో బూత్‌స్థాయి అధికారులు

➡ అక్టోబరు 18 వరకు అవకాశం

➡ జాబితాలో మార్పులు చేర్పులకు అర్జీల స్వీకరణ

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

ఓటు నమోదుపై ఎన్నికల సంఘం మరోసారి దృష్టి సారించింది. ఏటా ఓటర్ల జాబితా సవరణ పేరిట జరిగే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. కొత్తవి నమోదుతో పాటు మృతులు, చిరునామా మార్పు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు సేకరించడంతో పాటు వారి నుంచి దానికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.



వేటపాలెంలో ఇంటింటి సర్వేలో ఓటరు నుంచి వివరాలు తెలుసుకుంటున్న బీఎల్వో

గత సార్వత్రిక ఎన్నికల్లో అర్హులై ఉండి చాలా మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. అద్దె ఇళ్లలో ఉండే వారు తరచూ మారడంతో ఆ బూత్ నుంచి ప్రస్తుతం ఉంటున్న ప్రాంతానికి మార్పుచేసుకోకపోవడమే దీనికి కారణం. మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండేలా ప్రస్తుతం ఉన్న జాబితా ప్రకారం ఓటరు ఆ చిరునామాలో ఉన్నారా... వేరే ప్రాంతానికి వెళితే దాన్ని మార్పు చేయాలా... 'పేర్లలో ఏమైనా తప్పులు దొర్లాయా... ఫొటో బాగో లేదా...మార్పు చేయాలా' అనే దానిపై బీఎల్వోలు ఆరా తీస్తున్నారు. సవరణలకు సంబంధించి 6, 7, 8 ఫారాలు ఓటర్లకు అందజేస్తున్నారు. వాటిని పూర్తి చేసిన తరువాత తిరిగి తీసుకుంటున్నారు.

యాప్‌లో నమోదు

జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఇటువంటి వారు ఎవరైనా ఉంటే వారి నుంచి ధ్రువపత్రాలు తీసుకుంటున్నారు.

నియోజకవర్గాల వారీగా..

నియోజక వర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
చీరాల	2,02,711	98,729	1,03,958	24
బాపట్ల	1,90,925	92,803	98,112	10
వేమూరు	1,97,458	95,587	1,01,855	16
రేపల్లె	2,27,232	1,11,240	1,15,979	13
పర్చూరు	2,29,333	1,11,865	1,17,462	06
అద్దంకి	2,44,057	1,19,570	1,24,475	12

సర్వే చివరి తేదీ: అక్టోబరు 18
ముసాయిదా జాబితా విడుదల: అక్టోబరు 29
అభ్యంతరాల స్వీకరణ: డిసెంబరు 24 వరకు
తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 2025 జనవరి 6

గత ఎన్నికల్లో బూత్‌ల వద్ద ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. సర్వేతో పాటు వాటి వివరాలు సేకరించి, ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.

జిల్లాలో..
ఓటర్లు : 12,91,716
పురుషులు : 6,29,794
మహిళలు : 6,61,841
ఇతరులు : 81

ఎరువుల కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క వ్యవసాయాధికారి ఎరువు దుకాణాలను తప్పని సరిగా తనిఖీ చేసి అధిక ధరలకు ఎరువులను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థినులు

విద్యార్థులు సేవాదృక్పథం అలవరుచుకోవాలి

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు సేవాదృక్పథం అలవరుచుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్ చెప్పారు. మంగళవారం కళాశాలలో 56వ జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవంతో పాటు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భూమి కాలుష్యం అవుతుందని, దీని నివారణకు కాటన్ సంచులు వినియోగించాలని సూచించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.5 లక్షల చెక్కు అందజేత


భట్టిప్రోలు, న్యూస్‌టుడే: వరద బాధితులకు సహాయార్థం మండలంలోని ఐలవరానికి చెందిన మాచర్ల శివ భాస్కరరావు, సునీత రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు సోమవారం అందించారు. తెదేపా నాయకులు మాచర్ల నాగరాజు, జంపాల మురళీ, అత్తలూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణంపై విచారణ

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిలో నుంచి ప్రైవేటు స్థిరాస్తి వెంచర్‌లోకి సిమెంటు రోడ్డు నిర్మాణంపై చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి విచారణ జరిపారు. ఔత్సాహికుల నుంచి ఫిర్యాదు అందిన నేపథ్యంలో శింగరకొండ రోడ్డులోని స్థలాన్ని తహసీల్దార్ జి.శ్రీచరణ్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. సిమెంటు రోడ్డు నిర్మాణం ఎపుడు జరిగింది, నిధులు ఎంత, ఎవరు ఖర్చు చేశారు అనే అంశాల గురించి పురపాలక అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్ఐ రామారావు, వీఆర్వో బాషా తదితరులు ఉన్నారు.

ప్రపంచం గర్వించే తత్త్వశాస్త్రవేత్త సచ్చిదానందమూర్తి

తెనాలిలో శత జయంతి సభ



సచ్చిదానందమూర్తి జీవిత విశేషాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాడ్రేవు చినవీరభద్రుడు, ఇతర అతిథులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సమాజానికి జ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేసిన మహనీయుల గురించి నేటితరం తెలుసుకోవాలని, మన ప్రాంత విజ్ఞాని కొత్త సచ్చిదానందమూర్తి ప్రపంచం గర్వించదగిన తత్త్వశాస్త్రవేత్త అని ప్రముఖ కవి, కథారచయిత, గిరిజన సంక్షేమ శాఖ విశ్రాంత సంచాలకులు వాడ్రేవు చినవీరభద్రుడు తెలిపారు. వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ, తెనాలి ఇంప్రెషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సచ్చిదానందమూర్తి శత జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభలో ఆయన మాట్లాడుతూ చైనా, జపాన్ దేశాలు భారతదేశంలోని తత్త్వవేత్తల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత డాక్టరేట్లు ఇచ్చింది సచ్చిదానందమూర్తికే అని పేర్కొన్నారు. యువతను రాజకీయ నాయకులు కార్యకర్తలుగా, సామాజిక మాధ్యమ ఫాలోవర్స్, ట్రోలర్స్‌గా, సినీ తారలు పాలాభిషేకాలకు, క్రీడాకారులు చప్పట్లకు వాడుకుంటారని, కానీ బానిసగామారకు నిన్ను నీవు తెలుసుకో, ప్రశ్నించడం నేర్చుకో, దీపంగా మారి నీ వెలుగులో నిన్ను అధ్యయనం చేసుకో అని సరైన మార్గాన్ని చూపేవాడు తత్త్వవేత్తని విశ్లేషించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విశ్రాంత తెలుగు శాఖాధిపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ఆ పేరు పెట్టాలని, గుంటూరు-విజయవాడ మార్గంలో ఏర్పాటు చేయాలని సూచించినది సచ్చిదానందమూర్తేనని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సచ్చిదానందమూర్తి జీవిత విశేషాలను వివరిస్తూ బి.ఎల్.నారాయణ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు, సచ్చిదానందమూర్తి కుమారుడు కృష్ణ, డాక్టర్ దక్షిణామూర్తి, రామరాజు, వెంకటరత్నం, భీమేశ్వరప్రసాద్ మాట్లాడారు. పుస్తక రచయిత నారాయణ, మరో రచయిత జుగాష్ విల్లీలను సత్కరించారు. తొలుత సచ్చిదానందమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రైతుల కల నెరవేరేనా?

మేదరమెట్ల, న్యూస్‌టుడే

వర్షాధార భూములను ఆరుతడి, మాగాణి భూములుగా మార్చడం కోసం ఈ పథకాన్ని ప్రారంభించారు. దీని నిర్మాణానికి 2008 జూన్ 5న మైటాస్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. 2010 నాటికి పనులు పూర్తి చేయాలి. 2010లో మేలో సంభవించిన లైలా తుపాను సాకుగా చూపి మరో ఏడాది కాలపరిమితి పొడిగించాలని కోరడంతో ఒకసారి, ముంపు గ్రామం తూర్పుపాలెంలో భూసేకరణ వంకతో మరో ఏడాది గుత్తేదారు పనులను సాగదీశారు. 2012లో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీనికి ప్రధాన కారణం పాలకుల నిర్లక్ష్యమేనని రైతులు ఆరోపిస్తున్నారు.

పేరు: యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం
నిర్మించిన ప్రదేశం: కొరిశపాడు
ప్రారంభం: 2008 జూన్ 5న
అంచనా వ్యయం: రూ.177 కోట్లు
లక్ష్యం: 20 వేల ఎకరాల భూములకు సాగునీరు అందించడం (బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని కొరిశపాడు, దైవాలరావూరు, రావినూతల, పమిడిపాడు, రాచపూడి, ప్రాసంగులపాడుతో పాటు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం పోతవరం, బి.నిడమానూరు, కె.తక్కెళ్లపాడు, కళ్లగుంట గ్రామాలు)
ప్రస్తుత పరిస్థితి: 67 శాతం పూర్తయినా బిల్లుల చెల్లింపులో జాప్యంతో పనులు మధ్యలోనే నిలివేశారు. నిధులు కేటాయించాల్సి ఉంది.



తూర్పుపాలెంలోని ఎత్తిపోతల పథకం రిజర్వాయర్



ముంపు గ్రామం కష్టాలు

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపు గ్రామమైన తూర్పుపాలెంలో 14 ఏళ్లలో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదు. వర్షాలు పడినప్పుడు పరిస్థితి దారుణంగా ఉంటుంది. జిల్లాకి వచ్చిన ప్రతి కలెక్టర్ ప్రాజెక్ట్‌ను పరిశీలించి, గ్రామస్థులకు హామీ ఇస్తున్నారు. కానీ ఆ హామీలు ఇప్పటి వరకు అమల్లోకి రావడంలేదని, ప్రజాప్రతినిధులు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారు తప్ప ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



పథకాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. రైతులందరూ కూటమి సర్కారుపైనే ఆశలు పెట్టుకున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలో దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. కాలువల నిర్మాణ సమయంలో భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకి రూ.12 లక్షల నష్టపరిహారం ఇప్పించారు. ముంపు గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయడం లేదు. అక్కడ తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయకట్టు రైతులు 14 ఏళ్ల నుంచి నీరు లేక భూములు సాగు చేయలేపోతున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఇవ్వలేదు. అధికారులు స్పందించి అందించాలి.

– నాతాని హనుమంతరావు, కొరిశపాడు మండల రైతుసంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు

ఇద్దరి బిడ్డలతో సహా వివాహిత అదృశ్యంపై కేసు

చినగంజాం, న్యూస్‌టుడే: ఇద్దరు పిల్లలతో పాటు ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్సై శీలం రమేష్ అందించిన వివరాల ప్రకారం... మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు కుమారులు. ఒకరికి నాలుగేళ్లు, మరొకరికి నాలుగు నెలలు. భర్త బేల్దారీ మేస్త్రీగా పనిచేస్తుంటారు. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం భర్త బేల్దారీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం అతడి తల్లి ఫోన్ చేసి ఇద్దరి పిల్లలతో పాటు నీ భార్య ఇంటిలో కన్పించడం లేదని చెప్పింది. దీంతో సాయంత్రం వరకు వెతికినా కనపడకపోయేసరికి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పగటి పూట దళారులు.. చీకటి వేళ చోరులు



మేదరమెట్ల సెంటర్‌లో ఆందోళన చేస్తున్న పాడిరైతులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: పగలు బర్రెలను కొనుగోలు చేసే దళారులుగా గ్రామాల్లో తిరుగుతూ రాత్రి వేళల్లో వాటిని అపహరించే ముఠాను కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామానికి చెందిన గ్రామస్థులు సోమవారం అర్ధరాత్రి పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. గ్రామస్థుడు కొట్టే ఈశ్వరరావుకు చెందిన బర్రె రాత్రి 12 గంటల సమయంలో కనిపించలేదు. అప్రమత్తమైన యువకులు ఊరిలో వెతుకుతుండగా అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని గుర్తించారు. వారు పొంతన లేని సమాధానం చెబుతుండటంతో అనుమానం వచ్చిన గ్రామస్థులు వారిని విచారించగా విషయం వెలుగుచూసింది. సమీపంలో వాహనంలో ఉన్న గేదెను తీసుకొచ్చి అప్పగించారు. వారి వద్ద గేదెలకు మత్తు మందు ఇచ్చేందుకు సిరంజి, అందుకు సంబంధించిన మందు, ఒక కొడవలి లభించాయి. గ్రామస్థులు పట్టుకున్న ఇద్దరితో పాటు మరో ఊరికి సంబంధించిన ఇంకో వ్యక్తిని కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై వై.సురేష్ మాట్లాడుతూ.. గేదెలను దొంగతనం చేస్తూ దొరికిన మేదరమెట్లకు చెందిన ఆర్.నాగార్జున, శ్రీనివాసరావు, తమ్మవరం వాసి గురుస్వామిలపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నట్లు సమాచారం.

పోలీస్ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో రైతులు

గ్రామాల్లో పశువులను అపహరిస్తున్న దొంగలు దొరికారు అనే విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల్లోని పాడి రైతులు పెద్ద సంఖ్యలో మంగళవారం కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కొరిశపాడు, జె.పంగులూరు, అద్దంకి మండలాలతో పాటు ప్రకాశం జిల్లాలోని మద్దిపాడు, ముండ్లమూరు, దర్శి మండలాల్లోని రైతులు తరలివచ్చారు. అనంతరం మేదరమెట్ల బస్టాండ్ సెంటర్‌లో కొద్దిసేపు బైఠాయించి, దొంగలను కఠినంగా శిక్షించడంతో పాటు తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై సురేష్ పశువులను పోగొట్టుకున్న రైతులందరికీ న్యాయం చేస్తానని, దొంగలకు శిక్ష పడేటట్లు చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

✦ నాగార్జున, గురుస్వామి, శ్రీనివాసరావు, మరోవ్యక్తి బృందంగా ఏర్పడి గ్రామాల్లో పశువులను అపహరిస్తున్నారు. పగటి వేళ నాగార్జున, మరొకరు బర్రెలను కొంటామని గ్రామాల్లో తిరుగుతుంటారు. రాత్రి సమయంలో గేదెలకు మత్తు మందు ఇచ్చి ఎవరూ చూడకుండా తీసుకువెళ్తుంటారు. వాటిని వేర్వేరు జిల్లాల్లోని సంతల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. వారిని విచారిస్తే వెనుక ఉన్న పెద్ద ముఠా బయటకు వచ్చే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

కారు ఢీకొని భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు

బాపట్ల పట్టణం: వెనుక నుంచి కారు ఢీకొనటంతో భర్త మృతి చెందగా భార్యకు గాయాలైన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పీఎంఏవై ఎన్టీఆర్ గృహసంకల్ప నగర్ (జగనన్నకాలనీ)కి చెందిన దేవరకొండ వెంకటేశ్వర్లు(35) వంట పనులు చేస్తూ జీవిస్తుంటాడు. అతని భార్య పార్వతీ స్థానిక ఒన్వే వద్ద ఓ షాపింగ్ కాంప్లెక్సులో పనిచేస్తోంది. పనులు ముగించుకున్న భార్యాభర్తలు ఇద్దరూ కర్లపాలెంలో రోడ్డులోని ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. బాపట్ల నుంచి కర్లపాలెం వైపు ప్రయాణిస్తున్న కారు ఎస్పీ క్యాంపు కార్యాలయానికి ఎదుట వెనుక నుంచి వీరి బైక్‌ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు భర్త అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. భార్యకు చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు ప్రాంతీయ వైద్యశాల ఔట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

బ్యాటరీ రిక్షాలు అందించాలి

బాపట్ల పట్టణం: నిరుపేద రిక్షా కార్మికులను గుర్తించటంతో పాటు వారికి విద్యుత్తు బ్యాటరీ రిక్షాలను సబ్సిడీపై అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ కోరారు. మంగళవారం పట్టణంలోని రిక్షా కార్మికులు భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో తమకు ఎలక్ట్రికల్ బ్యాటరీ రిక్షాలను అందించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, మండల రెవెన్యూ అధికారి, కార్మికశాఖాధికారి, సోషల్ వెల్ఫేర్ అధికారులకు వినతి పత్రాలు అందచేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పర్చూరు(మార్టూరు),న్యూస్‌టుడే: పర్చూరుకు చెందిన 19 ఏళ్ల యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్సై మాల్యాద్రి మంగళవారం తెలిపారు. ఇటీవల స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన సాగర్ ఎలుకల మందు తినడంతో స్థానిక వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించారన్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు చెప్పారు. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్యపై కేసు

నిజాంపట్నం, న్యూస్‌టుడే: యువకుడు ఆత్మహత్య చెసుకున్న ఘటనపై అడవులదీవి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు.. అడవులదీవి పంచాయతీ పరిధిలోని మేకావారిపాలెం యేమినేని మాధవరావు రాజీల కుమారుడు బాల వెంకటశివకుమార్(22) డిప్లొమా పూర్తి చేసి విజయవాడలో పని చేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం తల్లికి ఆరోగ్యం క్షీణించడంతో స్వగ్రామం వచ్చాడు. తరచూ చరవాణిలో ఎక్కువగా సంభాషించేవాడు. అది గమనించిన తల్లి మందలించడంతో ఉరేసుకుని మృతి చెందాడని, విజయవాడలో తనకు ఓ యువతితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారిందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడవులదీవి ఎస్సై రవిశంకర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.91/-.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి పవిత్రమైన ప్రసాదం లడ్డులో కల్తీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమతం ఫౌండేషన్ ట్రస్ట్ కమతం విజయకుమారి డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు రేపల్లె మండలం పిరాట్లంకలో వేంచేసిన గంగానమ్మ దేవస్థానంలో మంగళవారం జనసేనపార్టీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు.

రేపల్లె ఎంపీడీవోగా శోభారాణి


శోభారాణి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లె ఎంపీడీవోగా ఎం. శోభారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన శివపార్వతి గుంటూరు జిల్లా పత్తిపాడు బదిలీ అయ్యారు.

కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కటంపై హర్షం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: భారతీయ జనతాపార్టీ నాయకుడు లంకా దినకర్ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా నియమితులు కావటంపై స్థానిక భాజపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మిత్రధర్మం పాటిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నామినేటెడ్ పదవుల భర్తీలో కూడా సమన్యాయం పాటిస్తూ దినకర్‌కు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వటంపై చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

నేడు చెకుముకి ప్రతిభ పోటీలు

తూర్పుపాలెం (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నేడు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో చెకుముకి సైన్స్ పరీక్షను నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇంకొల్లు రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో ఉపాధ్యాయులను కోరారు. పోటీల అనంతరం విజేతలు అక్టోబరులో నిర్వహించే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వరద బాధితులకు సాయం


గుంటూరుగూడెంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న వీఆర్‌వో సంస్థ ప్రతినిధులు

పొన్నపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పొన్నపల్లి చెరువు పొంగడంతో వారి పూరిళ్లు దెబ్బతినడంతో నిరాశ్రయులైన దంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యను గుర్తించిన చెరుకుపల్లికి చెందిన శిఖాకొల్లి సుబ్రమణ్యం మంగళవారం పూరిళ్ల మరమ్మతులకు రూ.30వేలను అందించారు. ఇంటింటికి కొద్ది మొత్తంలో నిత్యావసర సరుకులను అందించారు.

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని జువ్వలపాలెం శివారు గుంటూరుగూడెంలోని 250 వరద బాధిత కుటుంబాలకు విలేజ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ (వీఆర్‌వో) వారు మంగళవారం బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు.

భారీ వర్షం.. రైతుల హర్షం


చెరువును తలపిస్తున్న జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణం

చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం మండలాల్లో మంగళవారం వేకువజాము నుంచి గంటపాటు వర్షం కురిసింది. దీంతో ఆయా మండలాల్లో సాగు నీరందని భూముల్లో ఇటీవల రైతులు నాట్లు వేశారు. తీరా నాట్లు వేశాక నీరు లేక పొలాలు బీటలు వారాయి. దీంతో రైతులు నాటిన మొక్కలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో రైతులపాలిట జాలిచూపేను వరుణదేవుడు వర్షించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు కొంతమేర ఇబ్బందులకు గురయ్యారు. నగరం మండల పరిధిలోని మంతినవారిపాలెం- పెదపల్లి రహదారి చిన్నపాటి వాన కురిసినా జలమయం అవుతోంది. దీంతో ఆ దారిలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అవస్థలు పడ్డారు. గ్రామస్థులు అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.


దెబ్బతిన్న వెస్ట్‌స్వాంప్ మురుగుకాలువ వంతెన రక్షణగోడ

వాహనం అదుపు తప్పితే అంతే!


బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల-కంకటపాలెం ఆర్ అండ్‌బీ రోడ్డులో వెస్ట్‌స్వాంప్ మురుగు కాలువపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాంక్రీటు ఊడిపోయి ఇనుప చువ్వలు తుప్పుపట్టి బయటపడ్డాయి. రాత్రిళ్లు వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్తే వాహనదారుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. ప్రమాదాలు సంభవించక ముందే రక్షణ గోడకు మరమ్మతులు చేసి పటిష్ఠం చేయాల్సి ఉంది. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావును ప్రశ్నించగా వంతెన రక్షణ గోడకు త్వరలో మరమ్మతులు చేయిస్తామన్నారు.

మూడు నెలలుగా ఎక్కడివక్కడే!



పట్టణంలో సోమేశ్వరాలయ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ. 1.10 కోట్లతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేయాలని నిర్ణయించి గత మార్చిలో ప్రారంభించారు. నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు రూ. 25.30 లక్షల విరాళాలు ఇవ్వగా మిగిలిన రూ. 85 లక్షలను దేవాదాయశాఖ మంజూరు చేసింది. నిర్మాణ పనులు పర్యవేక్షించటానికి కమిటీని ఏర్పాటు చేశారు. మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయి. పునాది, పిల్లర్ల దశ వరకే నిర్మాణం జరిగింది. ప్రస్తుతం బాలాలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్నారు. పనులు నిలిచిపోవటంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయ ఈవో వెంకటేశ్వర్లును సంప్రదించగా వెంటనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామన్నారు. ఆలయాన్ని రాతి కట్టడంగా నిర్మిస్తామని పేర్కొన్నారు. **- బాపట్ల, న్యూస్‌టుడే**

ప్రజలకు లబ్ధి చేకూర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం


మండల మహిళా సమాఖ్య సభ్యులకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, బాపట్ల, రేపల్లె, పిట్టలవానిపాలెం, అమృతలూరు, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ప్రజలకు లబ్ధి చేకూర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రజా ప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చుండూరు మండలం వలివేరులో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ..దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టినా చంద్రబాబు సమర్థంగా పాలిస్తున్నారన్నారు. వలివేరు- పెనుగుదురుపాడు మార్గంలో ఇంటింటా తిరిగి ఇది మంచి ప్రభుత్వం గోడప్రతులు అంటించారు. వలివేరులో ఎమ్మెల్యే వస్తున్న క్రమంలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో తేనెటీగలు ఒక్క సారిగా దాడి చేశాయి. ప్రమాదంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పవన్‌తో సహా నలుగురికి గాయాలయ్యాయి. యువతకు ఉపాధి కల్పించటానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని నరసాయపాలెంలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే సీఎం చంద్రబాబు 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి మెగా డీఎస్సీపై సంతకం చేశారన్నారు. రానున్న ఐదేళ్లలో 5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. నల్లమడ వాగు ఆధునికీకరణ ఆవశ్యకతను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మానం విజేత మాట్లాడుతూ దీపావళి నుంచి మహిళలకు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయటానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన శివనారాయణ మాట్లాడుతూ వైకాపా పాలనలో స్థానికసంస్థలను నిర్వీర్యం చేశారన్నారు. ప్రజలు మెచ్చేలా 100 రోజుల పరిపాలన జరిగిందని బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ చెప్పారు. పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల కింద పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో రూ. 68 లక్షలతో ప్రధాన డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికలను చేపట్టామని తెలిపారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచి దాసి హైమావతి, తెదేపా మండల అధ్యక్షుడు ముక్కామల శివ, ఎంపీడీవో బాబూరావు, ఈవోఆర్డీ శరత్, తెదేపా నేతలు కామేపల్లి కృష్ణబాబు, చెన్నుపాటి కిషోర్, జెట్టి దినేష్ తదితరులు పాల్గొన్నారు. రేపల్లె 22, 23, 24, 25 వార్డులు, రూరల్ మండలం రాజుకాల్వ, పిరాట్లంక, మోళ్లగుంట, గంగడిపాలెం, చోడాయపాలెంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, ఎంఈవో రత్నశ్రీధర్, ఏపీఎం త్యాగరాజు, ఏపీవో సుబ్బరాజు తెదేపా నాయకులు కార్యదర్శులు పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు, అలకాపురం గ్రామాల్లో తెదేపా నాయకులు, అధికారుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అమృతలూరులో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వపాలనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. భట్టిప్రోలులో తెదేపా నాయకులు ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కుక్కల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


పిట్టలవానిపాలెంలో కరపత్రాలతో గ్రామస్థులు, అధికారులు

నేడు చెరుకుపల్లిలో ఇది మంచి ప్రభుత్వం

చెరుకుపల్లి న్యూస్‌టుడే: చెరుకుపల్లిలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి మురళి తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలన మొదలై వందరోజులైన సందర్భంగా జరిగిన అభివృద్ధి వివరించటం జరుగుతుందని ప్రజలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం

గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే: పోషకాహారం తీసుకోవడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సర్పంచి విజయలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన సమావేశం నిర్వహించారు.

కొరటాల సేవలు మరువలేనివి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: లంకగ్రామాల్లోని ప్రజల కోసం కొరటాల సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బాపట్ల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ అపవిత్రమైన నేపథ్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపడుతున్న దీక్షకు మద్దతుగా మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకపూజలు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమార్ ఆధ్వర్యంలో 101 గోవింద నామాలు పారాయణం చేశారు.

జిల్లా అభివృద్ధికి కృషిచేయండి

నిజాంపట్నం, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వి.జ్యోతిబసు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యుడు, తెదేపా నాయకుడు నర్రా సుబ్బయ్య మంగళవారం జడ్పీ కార్యాలయానికి వెళ్లి ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి, నిజాంపట్నం మండల అభివృద్ధికి తన వంతు సహాయం అందించాలని కోరారు.

ఏడాదిన్నరగా ఏడుపాక్కటే తక్కువ?


మూసి ఉన్న అప్పికట్ల-భర్తిపూడి రైల్వేగేటు

మండల పరిధిలో అప్పికట్ల-భర్తిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డులో రైల్వే గేటు వద్ద రైలు కింది వంతెన (ఆర్‌యూబీ) నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.ఆరు కోట్లు మంజూరు చేశారు. గతేడాది మార్చి 14న వంతెన నిర్మాణం పేరుతో రైల్వే గేటును అధికారులు మూసేశారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ ఏడాది సెప్టెంబరు 10న తెరుస్తామని ప్రకటిస్తూ రైల్వే గేటు వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. గేటు మూసేయడంతో అప్పికట్ల నుంచి భర్తిపూడి, గుడిపూడి గ్రామాలకు వెళ్లటానికి చుట్టూ నాలుగు కి.మీ. దూరం తిరిగి ఈతేరు-గుడిపూడి రైల్వేగేటు మీదగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. భర్తిపూడి చేరుకోవాలంటే ఆరు కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తోంది. వంతెన నిర్మాణం పేరుతో రైల్వేగేటును మూసి ఏడాదిన్నర గడుస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభించ లేదు. ముందుగా ప్రకటించిన విధంగా రైల్వే గేటు తెరవలేదు. రైలు కింది వంతెన నిర్మాణానికి ఇంకెన్నేళ్లు పడతాయోనని, తమ బాధలు ఎప్పుడు తీరతాయని భర్తిపూడి, గుడిపూడి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను స్థానిక ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్‌యూబీ పనులు సత్వరమే ప్రారంభించి నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తానని తెలిపారు. **- న్యూస్‌టుడే, బాపట్ల**

విద్యార్థులు స్వచ్ఛంద సేవకులుగా మారాలి


శ్రమదానం చేస్తున్న ఏజీ కళాశాల విద్యార్థులు

బాపట్ల, రేపల్లె అర్బన్, నగరం, న్యూస్‌టుడే: విద్యార్థులు స్వచ్ఛంద సేవకులుగా మారి సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని ఏజీ కళాశాల ఏడీ పి.ప్రసూనరాణి అన్నారు. వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ విమల బీర, డాక్టర్ బ్లెస్సీ సాగర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్‌సర్దార్‌బేగ్ అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పీజీ స్టడీస్ మాజీ డీన్ డాక్టర్‌ఆర్.వీరరాఘవయ్యను సత్కరించి సన్మానించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు నారాయణ భట్టు పాల్గొని దేశప్రగతిలో, ఆర్థికాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి సమాజసేవలో పాల్గొనాలని కోరుతూ యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు సమాజసేవను తమ సేవగా భావించి భవిష్యత్తుకు పునాదులు వేయాలని వక్తలు కోరారు. బాపట్ల ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రస్థానం ఎంతో విలువైనదని బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌లో చేరితే కలిగే ప్రయోజనాలు చేసే సేవా కార్యక్రమాలు వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు. నగరంలోని వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్య చౌదరి, ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ పాల్గొన్నారు.

అడ్డంకులిలా.. శివారుకు నీరెలా?


కాలువలో పడిన చెట్టు

ఖరీఫ్ సీజను ముగిసే వరకు శివారు భూములకు పుష్కలంగా సాగు నీరందిస్తామన్న జలవనరులశాఖ అధికారుల మాటలు క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. రేపల్లె మండలం కనగాలవారిపాలెం-బొబ్బర్లంక మధ్య ప్రధాన కాల్వలో పలుచోట్ల చెట్లు విరిగి పడి పారుదలకు అవరోధంగా మారినా ఎవరూ పట్టించుకోకపోవడమే అందుకు తార్కాణమని విమర్శిస్తున్నారు. ఇప్పటికే నల్లూరుపాలెం, సింగుపాలెం, కైతేపల్లి, తుమ్మల, పోటుమెరక శివారు వరి పంట పొలాలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. ప్రధాన కాలువలో సమృద్ధిగా నీరున్నా అనుసంధాన కాలువల ద్వారా నీరందించేలా అధికారులు చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వల్లో పడిన చెట్లు, కొమ్మలు తొలగించేలా దృష్టిసారించి శివారు పొలాలకు పూర్తిగా నీరందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై జలవనరులశాఖ డీఈ దీనదయాళ్ మాట్లాడుతూ కాలువలో పడిన చెట్టుకొమ్మలు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శివారు వరి చేలకు నీరందించేలా కృషి చేస్తామని తెలిపారు.

- రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత


రేపల్లె: కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

భట్టిప్రోలు, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: టీఎం రావు ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహిస్తున్న బాలుర విభాగంలో క్రీడాకారులను సోమవారం ఎంపిక చేశారు. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారి ఎన్.దేవరాజ్ ప్రారంభించారు. అండర్- 14, 17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, వ్యక్తిగత క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతిభ ఉన్నవారికి ప్రోత్సాహం ఇచ్చి మండల, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. రేపల్లె మాంట్‌ఫోర్ట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14, అండర్-17 బాల బాలికల మండల స్థాయి ఆటల పోటీలు ముగిశాయి. వివిధ పాఠశాల జట్ల మధ్య ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 26న జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కో- ఆర్డినేటర్ రమేష్‌బాబు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

కొల్లూరు, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: వినియోగదారులకు ఉచితంగా ఉసుక సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని సీఐ వీరాంజనేయులు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో రెండు మండలాల్లో భూగర్భ వనరులు, రెవెన్యూ, పోలీసు శాఖలు సంయుక్తంగా ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు సీఐ స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నిజాంపట్నం, న్యూస్‌టుడే: వినాయక నిమజ్జనలో కూచినపూడికి చెందిన దుంపా వేణు డీజే శబ్దానికి మృతిచెందాడు. మృతదేహాన్ని తెదేపా నాయకులు మంగళవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: కృష్ణా నదిలోని ఇసుకను కొల్లూరు నుంచి చెరుకుపల్లికి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లును ఎస్సై అనిల్‌కుమార్ పట్టుకున్నారు. మంగళవారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మండలానికి చెందిన మూడు ట్రాక్టర్లను ఐలాండ్ కూడలి వద్ద అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనచోదకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రఘురామకృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలి

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రేపల్లెలో పలువురు న్యాయవాదులు, దళిత ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్థిక, క్రిమినల్ నేర చరిత్ర ఉన్న ఆయనపై దేశద్రోహం చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మంగళవారం రేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21న కాళ్ల మండలం ఏలూరుపాడులో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉద్దేశ పూర్వకంగా అవమానించే విధంగా స్వయంగా చించి వేయడం హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఈదులపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా ఆయన చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన ఘటనపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా.. బాపట్ల జిల్లా, బాపట్ల మండలం, ఉప్పరపాలెంకి చెందిన చీరాల వెంకటేశ్వరరెడ్డి (70) రెండు ఏళ్ల నుంచి గుంటూరులోని దాసరిపాలెం ప్లాట్సులో నివాసం ఉంటున్నాడు. ప్రత్తిపాడు పరిధిలో కాటూరి వైద్యకళాశాల పక్కనే ఉన్న పొగాకు కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 22న సాయంత్రం డ్యూటీకి ఆటోలో బయలుదేరి కాటూరి వైద్యకళాశాల ఎదురు సర్వీసు రోడ్డులో ఆటో దిగాడు. పొగాకు కంపెనీ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా వెంకటేశ్వరరెడ్డిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చూసి అంబులెన్సులో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్ర చెప్పారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటమే ధ్యేయం


రైతులకు సూచనలు చేస్తున్న ఏవో బాలాజీగంగాధర్

బాపట్ల, కుంచాలవారిపాలెం (చెరుకుపల్లి గ్రామీణ),చెరుకుపల్లి, రేపల్లె అర్బన్, నగరం, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని అప్పికట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సేంద్రియ సాగు చేసేలా రైతులను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలన్నారు. భూ సారాన్ని పెంచుకోవటం ద్వారా అధిక దిగుబడులు సాధించాలన్నారు. విపరీతంగా ఎరువులు, రసాయన మందులు పిచికారీ చేయరాదని ఆయన తెలిపారు. డీఏవో రామకృష్ణ, ఏడీఏ లక్ష్మి, ఏవో చంద్రశేఖర్, తెదేపా పరిశీలకుడు సాంబశిరెడ్డి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వెంకటశివనారాయణ, అప్పికట్ల సర్పంచి రజిని, భర్తిపూడి సర్పంచి అమరేష్, గుడిపూడి సర్పంచి హనుమాన్, తెదేపా నేతలు ఇనగంటి గాంధీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి టి. బాలాజీ గంగాధర్ కోరారు. మండలంలోని కుంచాలవారిపాలెంలో ఆయన పర్యటించారు. వారానికి రెండు రోజులు ప్రతి మంగళ, బుధవారాల్లో కార్యక్రమాలు డిసెంబరు చివరివరకు జరుగుతాయని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక పంట దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ రేపల్లె సహాయ సంచాలకుడు రాగల విజయబాబు అన్నారు. కారుమూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖలు అధికారులు నగరం గ్రామ శివారులోని వరిచేలను పరిశీలించారు. వేమూరులో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారిణి సునీత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రానున్న రోజుల్లో వ్యవసాయం రైతులకు లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి అన్నారు. అద్దేపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి పైరులో పురుగు తీవ్రతను బట్టి నివారణ చర్యలు చేపట్టాలని ఏవో లోకేశ్వరి అన్నారు. అమృతలూరులో పొలం పిలుస్తోందిలో పాల్గొన్నారు.

ఆయిల్ ఇంజిన్ చోరీపై కేసు

వేమూరు, న్యూస్‌టుడే: అయిల్ ఇంజిన్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి కృష్ణ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని జంపనికి చెందిన ఎం.శ్రీనివాసరావు తన పొలంలో ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేశాడు. గుర్తు తెలియని దుండగులు ఈనెల 22న ఇంజిన్‌ను దొంగిలించారు. ఘటనపై మంగళవారం వేమూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

చుండూరు, న్యూస్‌టుడే: బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన చుండూరు మండలంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఓ గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక ఇంట్లో మరుగుదొడ్లు శుభ్రం చేసే ద్రావణాన్ని తాగింది. పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు బాలికను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై చుండూరు పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కుంగిన రోడ్డు..
రాకపోకలకు అడ్డు



ఏరియా ఆసుపత్రి రోడ్డులో పలు కార్పొరేట్ వైద్యశాలలు రావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ ప్రాంతంలో రోడ్డు కుంగి ఆరు అంగుళాల వరకు గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు దీనిపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏ వాహనం వేగంగా వెళ్లినా దీన్ని చూసి కచ్చితంగా బ్రేక్ వేయాల్సిన పరిస్థితి. ఇక ద్విచక్ర వాహనదారులైతే పక్క నుంచి వెళుతున్నారు. ఏడాదిన్నర క్రితం ఇప్పుడు రహదారి కుంగిన చోటుకు ముందుగా ఉన్న రోడ్డు కింద పైపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో దాదాపు నెలరోజులపైనే ఇటుగా రాకపోకలు నిలిపివేసి పనులు చేశారు. దీన్ని బాగుచేసినా మళ్లీ ట్రాఫిక్ మళ్లించాల్సిందేనని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. రోజురోజుకూ ఇక్కడ మరింతగా కుంగుతోంది. అధికారులు స్పందించి దీన్ని బాగుచేసేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

\- న్యూస్‌టుడే, చీరాల అర్బన్

చీరాల
• చీరాల • అద్దంకి • పర్చూరు

సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాల అందజేత

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం పంచాయతీ కార్యాలయానికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటాలను తెదేపా, జనసేన నాయకులు పంచాయతీ వార్డు సభ్యులు ఎం.రామసుబ్బారావు, ఎ.శ్రీరామ్, షేక్ నబీలు గ్రామ కార్యదర్శి అల్లా మస్తాన్‌రావుకు మంగళవారం అందజేశారు.

నీటి విడుదల

చీరాల, న్యూస్‌టుడే: చల్లారెడ్డిపాలెంలోని నాయనిపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మంగళవారం ఎమ్మెల్యే సాగునీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని తెలిపారు. మూలనపడిన మోటార్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసినట్లు చెప్పారు.

✦ కొత్తపేటలోని శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రక్తదానం

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద యువమోర్చా నేతలు మంగళవారం రక్తదానం చేశారు. యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమదాని శ్రీరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు నాగేంద్ర, వెంకటరమణ తదితరుల నేతృత్వంలో రేపల్లె రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదానం నిర్వహించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భాజపాకు చెందిన యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కోటిరెడ్డి, అశోక్, సురేష్ రక్తదానం చేశారు.

స్వచ్ఛతే శ్రీరామ రక్ష
అక్టోబర్ 2 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



పారిశుద్ధ్య కార్యక్రమంలో ఊడుస్తున్న కమిషనర్

చీరాల, న్యూస్‌టుడే

ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని గాంధీజీ భావన. అందుకే పారిశుద్ధ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ఆయన ఆశయాలను ఆదరణలోకి తెచ్చే విధంగా ప్రధాని మోదీ ‘స్వచ్ఛభారత్’కు 2014లో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఏటా మహాత్ముడి జయంతి సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. తరువాత ర్యాంకులు కేటాయించే పద్ధతి ప్రారంభించారు. ఇందులో మెరుగైన ఫలితాలు సాధించిన పురపాలక సంఘాలు, కార్పొరేషన్లకు అదనపు నిధులు కేటాయించే వారు. ఈ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారి ఇవి జరుగుతుండటం. దీనికి సర్కారు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా చీరాల పురపాలక సంఘం ఐటీసీ మిషన్ సంస్థ సహకారంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించటం, సెల్ఫీ పోటీ, సంతకాల సేకరణ, డిజిటల్ క్యాంపెయిన్, కార్మికులకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించి నిర్వహిస్తున్నారు. వీటితో పాటు రోజూ రోడ్లను శుభ్రంగా ఊడ్చటం, మురుగు కాలువలు పూడిక తీయటం, మురుగు నిలిచే దగ్గర క్రిమిసంహారక రసాయనాల పిచికారీతో పాటు ఆయిల్ బాల్స్ వదిలి వేస్తున్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ప్రదర్శనలు, మానవహారాలు చేపడుతున్నారు.

గతంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటుచేసి

స్వచ్ఛభారత్‌కు తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిచ్చింది. గతంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటుచేసి విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్రాన్ని పరిశుభ్రతవైపు నడిపించారు. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో రాష్ట్రం అత్యున్నత ర్యాంకులు సాధించింది. చీరాల పురపాలక సంఘం దక్షిణభారత స్థాయిలో రెండో స్థానంలో నిలవటంతోపాటు రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. రాష్ట్రానికి నమూనా పట్టణంగా నిలిచింది. ఇక్కడి అనేక మంది కమిషనర్లు, పారిశుద్ధ్య విభాగపు అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ర్యాంకుల్లో అధమస్థానానికి చేరుకుంది. ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాల స్ఫూర్తితో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెడితే త్వరలో చీరాల తిరిగి పూర్వవైభవం సాధిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కమిషనర్ చక్రవర్తి మాట్లాడుతూ ఇదే కార్యాచరణను కొనసాగిస్తూ భవిష్యత్తులో చీరాలకు మంచి ర్యాంకు సాధిస్తామని తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఫార్మా రంగానికి వైభవం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఫార్మా రంగం భవిష్యత్తులో మరింత వృద్ధి చెందుతుందని డీసీఆర్ఎం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణు అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఫార్మసీ కళాశాలలో ఆరోగ్య అవసరాలపై సదస్సు నిర్వహించారు. వేణు మాట్లాడుతూ దేశ ఫార్మా రంగం వృద్ధిలో దూసుకుపోతుందన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తే ఉద్యోగావకాశాలు మెరుగు పడతాయన్నారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డైరెక్టర్ శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

22 మంది ఎంపీడీవోలకు బదిలీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 22 మంది ఎంపీడీవోలను బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన అయిదుగురికి పోస్టింగులు కేటాయించారు. ఈ మేరకు జిల్లా ప్రజాపరిషత్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎంపీడీవోల బదిలీల వివరాలిలా ఉన్నాయి.

పేరు	పోస్టింగ్ ఇచ్చిన మండలం
కె.స్వరూపరాణి	జె.పంగులూరు
ఏ.శ్రీనివాసమూర్తి	చినగంజాం
వై.శ్రీనివాసరావు	మార్టూరు
కె.నేతాజీ	కారంచేడు
ఆర్.ఎల్.రాజ్యలక్ష్మి	కొరిశపాడు
కె.కుసుమకుమారి	బల్లికురవ
డి.సురేష్‌బాబు	సంతనూతలపాడు
జి.శ్రీనివాసరావు	ఇంకొల్లు
ఎం.రాజేష్‌బాబు	వేటపాలెం
బి.సింగయ్య	అద్దంకి

వంద రోజుల పాలనలో అందరికీ న్యాయం

చీరాల, మేదరమెట్ల, మార్టూరు, యద్దనపూడి, చినగంజాం, బల్లికురవ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని వందరోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశామని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం తోటవారిపాలెంలో మంగళవారం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేశారు. పౌష్టికాహారం అందజేశారు.



డేగరమూడిలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాన్ని అందిస్తున్న తెదేపా నాయకులు

✦ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకుందని చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి అన్నారు. కొరిశపాడు మండలం దైవాలరావూరులో ఇది మంచి ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, మండల ప్రత్యేకాధికారి ఉమ, తహసీల్దార్ మెహతాజ్, సర్పంచి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

✦ మార్టూరు మండలం డేగరమూడిలో ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ రజాక్, కామినేని జనార్దన్, శివ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకట్రావు, కార్యదర్శి టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

✦ యద్దనపూడి మండలం మున్నంగివారిపాలెంలో గ్రామ తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

✦ చినగంజాం మండలంలోని చినగంజాం, పల్లెపాలెం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఎంపీడీవో కె.స్వరూపరాణి, తెదేపా మండల అధ్యక్షుడు పొద వీరయ్య పాల్గొన్నారు. వంద శాతం ఉపాధి నిధులు రూ.7 లక్షలతో చినగంజాంలో, రూ.23.50 లక్షలతో సోపిరాలలో, రూ.17 లక్షలతో పల్లెపాలెంలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. చినగంజాం సర్పంచి రాయని ఆశ్వారావు, ఉప సర్పంచి చెరుకూరి రామయ్య, పల్లెపాలెం సర్పంచి సైకం మణి, నేతలు రాములు, సంఖ్యా శ్రీను పాల్గొన్నారు.

✦ బల్లికురవ మండలం ఉప్పుమాగులూరులో తెదేపా శ్రేణులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారులు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను పంచారు.

‘జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి’

ఇంకొల్లు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతకు కారణమైన మాజీ సీఎం జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా మంగళవారం ఇంకొల్లు చెన్నకేశవస్వామి ఆలయంలో జిల్లా నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి, సతీష్, ప్రవీణ్, శ్రీనివాసరావు, వెంకటేష్, అనిల్, నరేష్ పాల్గొన్నారు.

చీరాల గ్రామీణ సీఐగా శేషగిరిరావు బాధ్యతల స్వీకరణ

చీరాల గ్రామీణం: చీరాల గ్రామీణ సీఐగా శేషగిరిరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన నిమ్మగడ్డ సత్యనారాయణ గుంటూరు జిల్లా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన శేషగిరిరావు గుంటూరు వీఆర్‌లో ఉంటూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈయన గతంలో కొంతకాలం చీరాల ఒకటో పట్టణ సీఐగా పనిచేశారు.

రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

అద్దంకి,న్యూస్‌టుడే: అద్దంకి రెవెన్యూ కార్యాలయం నుంచి పలువురు సిబ్బంది బదిలీ అయ్యారు. సీనియర్ సహాయకులు కృష్ణమోహన్, జూనియర్ సహాయకులు వై.సాయికృష్ణ కొరిశపాడు కార్యాలయానికి బదిలీ అయ్యారు. జూనియర్ సహాయకులు/టైపిస్టు జి.శ్రీనివాసరావు బల్లికురవకు బదిలీ అయ్యారు. కొరిశపాడు కార్యాలయంలో పనిచేస్తున్న టైపిస్ట్/జూనియర్ సహాయకులు టి.శ్వేత అద్దంకి కార్యాలయానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

నేడు వేటపాలెంలో విద్యుత్తు సరఫరా నిలిపివేత

వేటపాలెం, న్యూస్‌టుడే: నూలుమిల్లు వద్ద ఉన్న 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో కొత్త పరికరాలు ఏర్పాటు నిమిత్తం బుధవారం వేటపాలెం, దేశాయిపేట ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అరుణ కుమారి తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

చీరాల, న్యూస్‌టుడే: రైతులకు అండగా ఉండి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడు కృషిచేస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని మంగళవారం తోటవారిపాలెంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు, వ్యవసాయాధికారులు సూచించిన విధంగా సాగు చేయాలన్నారు. విధిగా పంట మార్పుకోవటంతోపాటు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. సాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం సమన్వయకర్త విజయనిర్మల మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. శాస్త్రవేత్త మురళీధర్ మాట్లాడారు. అనంతరం కార్యక్రమ వాహనాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. బాపట్ల ఏడీఏ రత్నకుమారి, ఏవో సుమతి, పశువైద్యాధికారి పావని, ఏఎంసీ కార్యదర్శి రాణి, తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మాట్లాడుతున్న అద్దంకి వ్యవసాయ సహాయ సంచాలకుడు ధన్‌రాజ్

అద్దంకి, బల్లికురవ, జే పంగులూరు, సంతమాగులూరు, మేదరమెట్ల, న్యూస్‌టుడే: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అలవర్చుకోవాలని, తద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని అద్దంకి వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.ధన్‌రాజ్ అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని ధర్మవరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో ఆయన మాట్లాడారు. సర్పంచి చావల కల్యాణి అధ్యక్షత వహించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.మోహనరావు మాట్లాడుతూ తమ శాఖ ద్వారా రాయితీపై ఎర్రజొన్నలు అందిస్తున్నామన్నారు. ఉద్యాన శాఖాధికారి దీప్తి మాట్లాడుతూ కూరగాయలు సాగు చేసిన రైతుకు ఎకరాకు రూ.8 వేలు అందించనున్నట్లు చెప్పారు.

✦ బల్లికురవ మండలం వేమవరంలో జరిగిన కార్యక్రమంలో ఏవో ఎస్‌వీపీ.కుమారి పాల్గొన్నారు. పత్తి, పొగనారు మడులను పరిశీలించారు. పశువైద్యాధికారి వెంకట్రావు, సర్పంచి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యులు అలివేలమ్మ, గొట్టిపాటి మారుతి, మలాది వీరాంజనేయులు, వ్యవసాయ సహాయకులు సోమా వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

✦ జే పంగులూరు మండలం రామకూరులో ఏవో డి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. పశువైద్యాధికారి ఎం.మురళీకృష్ణ, మార్కెటింగ్ శాఖాధికారులు, వ్యవసాయ సహాయకులు పృథ్వీ పాల్గొన్నారు.



చీరాల: జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, తదితరులు

✦ వెల్లలచెరువులో జరిగిన కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు. వరి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు.

✦ కొరిశపాడు మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు మేదరమెట్లలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. గోడ పత్రాన్ని ఆవిష్కరించారు.

ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మిశ్రమ ఎరువుల వినియోగంతో పైర్లకు ప్రయోజనం కలుగుతుందని పర్చూరు ఉద్యాన అధికారి రవిప్రకాష్‌బాబు పేర్కొన్నారు. పావులూరులో ‘పొలం పిలుస్తోంది’ నిర్వహించారు. వ్యవసాయాధికారి వేణుగోపాల్, ఉప పశువైద్యాధికారిణి అన్నపూర్ణ మాట్లాడారు. సర్పంచి లూధియమ్మ, రైతులు పాల్గొన్నారు.

✦ యద్దనపూడి మండలం గన్నవవరంలో జరిగిన కార్యక్రమంలో ఏవో సీహెచ్ ఆదినారాయణబాబు, తెదేపా మండల తెదేపా అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి పాల్గొన్నారు. యద్దనపూడిలో రైతులకు రాయితీ విత్తనాలు అందించారు. పర్చూరులో ఏడీఏ మోహనరావు పాల్గొన్నారు.



మృతుడి బంధువులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

రమేష్‌చంద్ర మృతికి మంత్రి సంతాపం

రామ్‌నగర్(అద్దంకి), న్యూస్‌టుడే: పట్టణంలోని మధురానగర్‌లో నివసించే మన్నె రమేష్ చంద్ర మృతికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటి వద్ద మృతదేహానికి నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. రమేష్‌చంద్ర మృతదేహానికి మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, డాక్టర్ బాచిన చెంచు గరటయ్య నివాళులు అర్పించారు.

జొన్నతాళిలో దోమల మందు పిచికారి

జొన్నతాళి (మార్టూరు), న్యూస్‌టుడే: దోమల నియంత్రణకు గ్రామంలో ఫాగింగ్ చేస్తున్నట్లు మార్టూరు మండలం జొన్నతాళి సర్పంచి శానంపూడి నాగేంద్రమ్మ తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిలో కాలువలు, వెంట దోమల మందును పిచికారి చేయించినట్లు చెప్పారు.

విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు

వేటపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు అలవరచుకోవాలని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రధానాచార్యుడు డాక్టరు కె.జగదీష్‌బాబు పేర్కొన్నారు. కళాశాలలో జాతీయ సేవా విభాగం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నీలకంఠపురంలోని అనాథ శరణాలయానికి బియ్యం, పండ్లు అందజేశారు. ప్రోగ్రాం అధికారి డాక్టరు దివి జ్యోతి స్వరూప్, కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అక్రిడిటేషన్ డైరెక్టరు డాక్టరు సీఎస్ రావు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

కొండమంజులూరు(జే పంగులూరు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీల జట్టును మంగళవారం ఎంపిక చేశారు. కొండమంజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలను ఎంఈవో-2 గోగుల వీరాంజనేయులు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని ఐ.అనిత అధ్యక్షతన పోటీలు జరిగాయి.



వేటపాలెం: కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలురు

✦ అద్దంకి నియోజకవర్గ స్థాయి స్పోర్ట్స్ మీట్ ఈనెల 26కు వాయిదా పడినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.సుబ్బారావు తెలిపారు. మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాలలో పోటీలు ఉంటాయని చెప్పారు.

వేటపాలెం: పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్ 14, 17 బాలికల విభాగం ఖోఖోలో పందిళ్లపల్లి, కబడ్డీలో వేటపాలెం, వాలీబాల్‌లో దేశాయిపేట జడ్పీ పాఠశాలల విద్యార్థినులు మొదటి స్థానంలో నిలిచారు. బాలుర విభాగం వాలీబాల్ అండర్ 14లో ఎంజేపీ గురుకుల, అండర్ 17లో పందిళ్లపల్లి విద్యార్థులు, కబడ్డీలో గురుకుల, కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలు బుధ, గురువారాలలో పందిళ్లపల్లి క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు సమన్వయకర్త సీతాదేవి, ఇతర పీడీలు కర్న నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, హనుమంతురావు, శ్రావణి, కోటేశ్వరమ్మ, మమత, శివయ్య తెలిపారు.

మార్చి నెలాఖరుకు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

అద్దంకి, బల్లికురవ, జే పంగులూరు, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి/జిల్లా అటవీ శాఖాధికారి ఎల్.భీమయ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నోడల్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ‘మన ఇల్లు మన గౌరవం’ పేరుతో అన్ని రకాల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, లబ్ధిదారుల నుంచి గృహ నిర్మాణాన్ని పూర్తిచేసే హామీ తీసుకోవాలన్నారు. జే పంగులూరు మండలంలో ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్ నేతృత్వంలో ఎంపీడీవో బి.రామాంజనేయులు, బల్లికురవ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి/ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

సంతమాగులూరు: మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ కోరారు. ఇంజినీరింగ్ సహాయకులతో మంగళవారం సంతమాగులూరులో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా గృహ నిర్మాణ పథకం అమలు తీరు తెన్నులపై సమీక్షించి, సూచనలు చేశారు.

మేదరమెట్ల, కారంచేడు, న్యూస్‌టుడే: గృహాలు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ ఉమా అన్నారు. కొరిశపాడు మండలం దైవాలరావూరులో నిర్వహించిన మన ఇల్లు, మన గౌరవంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీవో సురేష్‌బాబు, హౌసింగ్ ఏఈ నటరాజ్ పాల్గొన్నారు. నీ కారంచేడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధికారులతో సమీక్ష నిర్వహించారు.



వీరన్నపాలెంలో పోషకాహార మాసోత్సవాల్లో సీడీపీవో సుభద్రాదేవి

చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం

వేటపాలెం: చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ ఏసీడీపీవో సుచిత్ర అన్నారు. గర్భిణులు వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పండంటి బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఉందన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ సామాజిక భవనంలో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహారోత్సవంలో ఆమె మాట్లాడారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. రోటరీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.వి.సురేష్, ఊటుకూరి లక్ష్మణస్వామి, గొల్లపూడి సీతారాం, బట్ట మోహనరావు, ప్రత్తి వెంకటసుబ్బారావు, సూపర్‌వైజర్లు పుష్పవల్లి, లీలావతి, ఫినిష్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

పర్చూరు, కారంచేడు (మార్టూరు): పర్చూరు మండలంలోని వీరన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో పర్చూరు సెక్టార్ సీడీపీవో సుభద్రాదేవి పాల్గొన్నారు. ✦ కారంచేడు ఎంపీయూపీ పాఠశాలలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.సుమలత మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

25 మద్యం సీసాల స్వాధీనం

కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: కారంచేడు ఎస్సీ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మోషేను అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. అతని నుంచి 25 సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ పరిధి బండారు నాగేశ్వరరావు కాలనీ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న కె. పరిశుద్ధరావును ఈపూరుపాలెం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ట్రైరు బండిని స్వాధీనం చేసుకుని, స్టేషన్ హౌస్ అధికారి కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.